క్లుప్తంగా

టీటీడీ బోర్డు సభ్యునిగా నాగసత్యం ప్రమాణ స్వీకారం



స్వామివారి ఫొటోను అందుకుంటున్న నాగసత్యం

ఏలూరు (టూటౌన్) : తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యునిగా ఏలూరు నగరానికి చెందిన నెరుసు నాగ సత్యం ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. తిరుమలలోని జయ, విజయ ద్వారం వద్ద నెరుసు నాగ సత్యం చేత ఆలయ అధికారులు ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయనకు స్వామి వారి చిత్ర పటాన్ని, పట్టు వస్త్రాలను అందజేశారు. ప్రమాణస్వీకారం అనంతరం నెరుసు నాగ సత్యం కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకున్నారు. నాగ సత్యం కుటుంబ సభ్యులు, ఏపీ ఎన్జీవోస్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నెరుసు వెంకట రామారావు, నెరుసు వెంకటచలపతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో డ్రెయినేజీ ప్రక్షాళన



డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టిన దృశ్యం

ఏలూరు రూరల్: ఏలూరు 15వ డివిజన్ నెహ్రూనగర్‌లో కార్పొరేషన్ అధికారులు ఆదివారం డ్రెయినేజీ ప్రక్షాళన చేపట్టారు. కొద్దిరోజులుగా పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ చెత్తాచెదారంతో పూడిపోయింది. పిచ్చిమొక్కలు పెరిగి మురుగునీరు కిందకు పారడం లేదు. దీంతో పరిసర ప్రాంత ప్రజలు సమస్యను స్థానిక కార్పొరేటర్ తంగెళ్ల రాము దృష్టికి తీసుకొచ్చారు. దీంతో రాము శానిటేషన్ అధికారులకు సమాచారం అందించి పొక్లెయిన్‌తో డ్రెయినేజీ పూడికతీత పనులు చేపట్టారు. పొక్లెయిన్‌తో డ్రెయినేజీ మొత్తం ప్రక్షాళన చేసి, మురుగునీరు పారుదలకు మార్గం సుగమం చేశారు.

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజకీయ పక్షాల రౌండ్ టేబుల్ సమావేశం ఏలూరులో ఆదివారం నిర్వహించారు. అగ్రిగోల్డ్‌లో డిపాజిట్ చేసిన సొమ్ము దాని ఆస్తుల విలువ కన్నా తక్కువ ఉన్నందున ప్రభుత్వం జోక్యం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీవీ చంద్రశేఖర్, పలు పార్టీల నేతలు పాల్గొన్నారు.

అభివృద్ధి అదరహో..

- నాలుగేళ్లలో రూ.388.55 కోట్లు ఖర్చు
- అభివృద్ధి పనులకు రూ.106.40 కోట్లు
- సంక్షేమ పథకాలకు రూ.282.15 కోట్లు
- అభివృద్ధి బాటలో ఏలూరు మండల గ్రామాలు





మల్కాపురంలో రూ.45 లక్షలతో కట్టిన సచివాలయం, రూ 3.5 కోట్లతో గుడివాకలంకలో సబ్‌స్టేషన్ నిర్మాణం





మాదేపల్లిలో నిర్మించిన ట్యాంక్, సంపు, గుడివాకలంకలో జెడ్పీ పాఠశాల తరగతి గదుల నిర్మాణం(ఫైల్)

ఏలూరు రూరల్: ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గ 15 గ్రామాల్లో ప్రభుత్వం ఒకపక్క సంక్షేమ పథకాలు అమలు చేస్తూ, మరో పక్క అభివృద్ధి పనులు చేపట్టి పల్లె ప్రజల జీవితాల్లో వెలుగులు నింపింది. సీసీ రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి పైప్‌లైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, మౌలిక వసతులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన జీవనస్థితి కల్పించింది. పంచాయతీ, జెడ్పీ, మండల పరిషత్ వ్యవస్థలు ఏర్పడిన నాటి నుంచి నేటివరకూ ఏ ప్రభుత్వం ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఇవ్వలేదని ప్రజలు, ప్రజాప్రతినిధులు చెప్పుకుంటున్నారు.

అభివృద్ధి పనులతో కొత్త పుంతలు

గతంలో ఎన్నడూ లేని విధంగా మల్కాపురం, చాటపర్రు, మాదేపల్లి, జాలిపూడి, శ్రీపర్రు, కలకుర్రు, కాట్లంపూడితో పాటు లంకగ్రామాల్లో అభివృద్ధి పనులు జరిగాయి. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుమారు రూ.100 కోట్లతో చేపట్టిన అర్బన్ ప్రాజెక్టు ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటి వరకూ గ్రామాల్లో 11 ఓవర్‌హెడ్ ట్యాంకులు నిర్మించారు. రూ.10 కోట్ల జలజీవన్ మిషన్ నిధులతో సుమారు 20 కిలోమీటర్ల దూరం తాగునీటి పైప్‌లైన్, ఇంటింటికీ కుళాయి వేశారు. మరోపక్క సుమారు రూ.కోటి 40 లక్షల మండల పరిషత్ నిధులతో కొక్కిరాయి లంకలో గ్రావెల్ రోడ్లు, మల్కాపురంలో డ్రెయినేజీ, పైడచింతపాడులో సీసీరోడ్లు, మాదేపల్లి, చాటపర్రులో ఫిల్టర్‌బెడ్లు మరమ్మతులు, బోర్లు తవ్వించారు. తిమ్మారావుగూడెం, కోటేశ్వరదుర్గాపురంలో సుమారు రూ.12 లక్షలతో కల్వర్టులు కట్టారు. రూ.20 కోట్లతో కైకలూరు రోడ్డు, శ్రీపర్రు వంతెన నిర్మాణం జరిగింది. ఇదే క్రమంలో మరో రూ.4 కోట్లతో కొల్లేరు రోడ్ల అభివృద్ధి జరుగుతోంది. దీనికి తోడు గ్రామానికి సుమారు రూ.కోటి చొప్పున మొత్తంగా 15 గ్రామాల్లో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ క్లినిక్ భవనాల కోసం రూ.15 కోట్లు ఖర్చు చేస్తున్నారు. మరో రూ.3 కోట్ల నాడు-నేడు నిధులతో పాఠశాలలు అభివృద్ధి చేశారు. విద్యుత్‌శాఖ రూ.3.50 కోట్లతో గుడివాకలంకలో సబ్‌స్టేషన్ నిర్మిస్తోంది. జగనన్న కాలనీల్లో వేలాది కరెంట్ స్తంభాలు, పదుల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తోంది. మొత్తంగా నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం 500కు పైగా అభివృద్ధి పనులు చేపట్టి సుమారు రూ.106.40 కోట్లు ఖర్చు చేయనున్నారు.

సంక్షేమ పథకాలతో పేదలకు మేలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేదల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడుతున్నాయి. అమ్మ ఒడి, వైఎస్సార్ భరోసా, వైఎస్సార్ సున్నా వడ్డీ, పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీతో మొత్తంగా 26 సంక్షేమ పథకాలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 61,310 మంది లబ్ధిదారులకు మేలు చేశారు. ఒకొక్క కుటుంబంలో ఇద్దరు లేక ముగ్గురు లబ్ధిదారులు ఉండడం విశేషం. నాలుగేళ్ల పాలనలో 282 కోట్ల 15 లక్షల 30 వేల 12 రూపాయలు పేదలు అందుకున్నారు. అంటే ఏడాదికి రూ.70 కోట్ల 53 లక్షల 82 వేల 503 విడుదల చేశారు.

అభివృద్ధే ప్రధాన లక్ష్యం



మండలంలో అభివృద్ధి వేగంగా జరిగింది. అభివృద్ధి వెనుక ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి ఎంతో ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేయించారు. మండలంలో ప్రతి గ్రామంపై ఆయన దృష్టి పెట్టి తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ, విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయిస్తున్నారు.

– పెనుమత్స శ్రీనివాసరాజు, ఎంపీపీ

సీసీ రోడ్లు వేశారు



ప్రభుత్వం మా గ్రామంలో జగనన్న కాలనీ అభివృద్ధి చేసింది. లక్షల రూపాయలు వెచ్చించి ఇళ్ల స్థలాలు మెరక చేయించి, రోడ్లు, కరెంట్ సౌకర్యాలను కల్పించారు. 100 మందికి పైగా పేదలు ఇళ్లస్థలాలు అందుకున్నారు. ఒకొక్క ఇంటికి రూ.1.80 లక్షలు ఇచ్చింది. గ్రామంలో సచివాలయం, ఆర్‌బీకే, వైఎస్సార్ క్లినిక్ కడుతున్నారు. మండల పరిషత్ నిధులతో సీసీరోడ్లు వేశారు.

– ముంగర తిమోతీ, పైడిచింతపాడు సర్పంచ్

లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలి

దెందులూరు: రాష్ట్రంలో చర్మకారుల అభివృద్ధి కోసం కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన కోట్లాది రూపాయలను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ, లిడ్ క్యాప్ ఎండీ వెంటనే లెదర్ పార్కులు ఏర్పాటు చేయాలని దళితసేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. ఆదివారం దెందులూరు వచ్చిన ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చర్మకారులు జీవన విధానం, అభివృద్ధి, సంక్షేమం అమలుకు ప్రభుత్వం సబ్సిడీతో కూడిన రుణాలివ్వాలని కోరారు.

300 మందికి ఉచిత కంటి పరీక్షలు

ద్వారకాతిరుమల: విజ్‌డమ్ ఫౌండేషన్, రామకృష్ణ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ పులవర్తి రామకృష్ణ పర్యవేక్షణలో స్థానిక సాయిబాబా ఆలయ సమీపంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీవీ బ్రదర్స్ తమ తండ్రి జ్ఞాపకార్థం ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరుకు చెందిన ప్రముఖ వైద్యురాలు ప్రభావతి, జంగారెడ్డిగూడెంకు చెందిన ఆర్‌కే డయాగ్నోసిస్ ల్యాబ్ నిర్వాహకులు వైద్య సేవలందించారు. 300 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

మదర్ థెరిస్సా జీవనం ఆదర్శప్రాయం



మదర్ థెరిస్సా జయంతి కార్యక్రమంలో పాల్గొన్న పెయింటర్స్ యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్) : మదర్ థెరిస్సా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తోటి వారికి సాయం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య అన్నారు. స్థానిక రమామహల్ సెంటర్లో మదర్ థెరిస్సా పెయింటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం థెరిస్సా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయ్య మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనే స్ఫూర్తితో ఖండాంతరాలు దాటి వచ్చి దేశంలో నిరుపేదలు, అభాగ్యులు, అనాథలు, కుష్టు రోగులకు ఎనలేని సేవలందించిన మదర్ థెరిస్సా జీవనం అందరికీ ఆదర్శ ప్రాయమని అన్నారు. యూనియన్ వ్యవస్థాపకులు అయినపర్తి మాధవరావు, తమ్మినేని నాగరాజు, బి.సోమయ్య మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పెయింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి, కార్యదర్శి బంగారు బాబు, సహాయ కార్యదర్శి పి.రాము, శేఖర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు కొనసాగించాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది.

తపాలా ఉద్యోగుల 5కే వాక్



5కే వాక్‌లో పాల్గొన్న తపాలా ఉద్యోగులు

ఏలూరు (టూటౌన్) : జాతీయ క్రీడా దినోత్సవంను పురస్కరించుకుని ఏలూరు తపాల ఉద్యోగులు ఆదివారం స్థానిక మినీ బైపాస్ రోడ్డులో 5కే వాక్‌ను నిర్వహించారు. క్రీడలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ 5కే వాక్‌ను నిర్వహించినట్లు ఏలూరు డివిజన్ సూపరింటెండెంట్ బి.అంబేద్కర్ తెలిపారు. భారతీయ హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ పుట్టిన రోజు ఆగస్టు 29ని కేంద్ర ప్రభుత్వం జాతీయ స్పోర్ట్స్ దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా వారం రోజుల పాటు క్రీడా ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డివిజన్ సూపరింటెండెంట్ డి.శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్స్ అభిషేక్, డివిజన్ పోస్టల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాజ సేవలో యువత భాగస్వాములు కావాలి



ధార్మిక సమావేశంలో మాట్లాడుతున్న హాసీబ్ మదని

ఏలూరు (టూటౌన్): సమాజ సేవలో యువత భాగస్వాములై రాబోయే తరానికి ఆదర్శంగా నిలవాలని అబ్దుల్ హాసీబ్ ఉమ్రి మదని పిలుపునిచ్చారు. మనమంతా ఒక్కటే మన అందరి సృష్టికర్త ఒక్కడే అనే అంశంపై జమియ్యత్ అహ్లెహదీస్ ఏలూరు శాఖ ఆధ్వర్యంలో స్థానిక టుబాకో మర్చంట్ కళ్యాణ మండపంలో ఆదివారం ధార్మిక సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మదని మాట్లాడుతూ సమాజంలో శాంతి ప్రేమను పంచుతూ ఒక భారతీయుడిగా దేశం, సమాజం కోసం అహర్నిశలు కృషి చేయాలన్నారు. మనుషులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దేవ గ్రంథంలో ఉన్న విషయాలను కప్పిపుచ్చి మనిషిని భయభ్రాంతులకు గురిచేసి సృష్టి రాశులను పూజించే విధంగా వలయం ఏర్పాటు చేశారన్నారు. నేటి యువత నైతిక విలువలుకలిగి ఉండాలన్నారు. సభాఅధ్యక్షుడు జమ్మియత్ అహలే హదీస్, రాష్ట్ర అధ్యక్షుడు ఫజలురహ్మాన్ ఉమ్రీ మాట్లాడుతూ ఖురాన్, హదీసు అనుగుణంగా జీవితం గడపాలన్నారు. దేశంలో ఏదైనా ఆపద వస్తే ముస్లింలు ముందుండి ప్రజలను రక్షించడంలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా సహాయం చేసిన సందర్భాల్లో కరోనా ఒకటని గుర్తు చేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం పెద్దలు, నాయకులు, యువత పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	32	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	64
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	42
వంకాయలు (తెలుపు)	36	ములక్కాడలు	05-08
బెండకాయలు	26	కంద	40
పచ్చిమిర్చి	36-44	బీట్‌రూట్	36
కాకర కాయలు	40-44	కీరా దోస	36
బీరకాయలు	36-48	ఫ్రెంచ్‌బీన్స్	72
బీరకాయలు (పందిరి)	--	అల్లం	120-220
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	36	పాలకూర	10
దొండకాయలు	36	చుక్కకూర	10
బంగాళదుంపలు	26	తోటకూర	10
ఉల్లిపాయలు	32	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	30-46	కోడూరు చాక్కుడు	124
ఆనపకాయ (1)	15-20	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	11

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	12
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	22
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	13
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	17
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	08.00	4794	రద్దు
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	33
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	33
ఏలూరు -తిరుపతి	16.00	4830	31

పశువుల ఆరోగ్య పరిరక్షణకు టీకా

- వాతావరణ మార్పులతో వ్యాధుల బారిన పడుతున్న పశువులు
- సకాలంలో వైద్యం అందించాలంటున్న అధికారులు
- గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు, లంపీ స్కిన్ డిసీజ్‌కు టీకాలు



పెయ్యిదూడలకు టీకాలు వేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: పశువులకు వచ్చే వివిధ వ్యాధుల పట్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధుల వల్ల పశువులలో పనిచేసే శక్తి, పాల ఉత్పత్తి తగ్గిపోతుంది. అయితే పశువులకు వచ్చే వ్యాధుల్లో ముఖ్యమైనవి గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వ్యాధి. అలాగే లంపీ స్కిన్ డిసీజ్ కూడా పశువుల్లో ఎక్కువగా కనిపిస్తున్నట్లు పశువైద్యాధికారులు చెబుతున్నారు. ఈ వ్యాధులు సోకడం వల్ల లేగదూడలు, పెయ్యలు ఎక్కువ సంఖ్యలో మరణించే అవకాశం ఉందని వారు చెప్తున్నారు. అలాగే పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గి ఆర్థిక నష్టం కలుగుతుంది. ఈ పరిస్థితుల్లో పశువుల ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వాతావరణ మార్పుల వల్ల వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ఉచిత టీకా కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ వ్యాధి పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సకాలంలో పశువులకు వైద్యం అందేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచిస్తున్నారు. సకాలంలో టీకా వేయిస్తే పశువులకు అది శ్రీరామరక్ష అని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో 39,876 పశువులకు టీకాలు

పశువులకు ఇచ్చే వ్యాధుల నివారణకు ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు వైద్యాధికారులు చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ముమ్మరం చేశారు. ఇప్పటి వరకూ 70 శాతం వరకూ పశువులకు టీకాలు వేసినట్లు అధికారులు చెప్తున్నారు. ముఖ్యంగా లంపీ స్కిన్ డిసీజ్‌తో ఉన్న 38,567 పశువులకు టీకాలు వేయడం జరిగింది. అలాగే గొంతు వాపు వ్యాధి సోకిన 39,876 పశువులకు టీకాలు వేసినట్లు అధికారులు చెప్పారు. ఆడ పెయ్యి దూడ సంరక్షణకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. వీటిలో భాగంగా 3200 పెయ్యి దూడలకు బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేసినట్లు అధికారులు చెప్పారు. రైతులు తప్పనిసరిగా పశువులకు టీకాలు వేయించాలని అధికారులు సూచిస్తున్నారు.

పశువులకు వ్యాక్సిన్‌లు వేస్తున్నాం



పశువులకు వచ్చే గాలి కుంటు వ్యాధి, గొంతువాపు, లంపీ స్కిన్ డిసీజ్‌ల నివారణకు వ్యాక్సిన్‌ల కార్యక్రమం చేపడుతున్నాం. వాతావరణం మార్పు వల్ల పశువులు ఈ వ్యాధి బారిన పడతాయి. రైతులు పశువుల్లో వచ్చే ఈ వ్యాధిని గుర్తించి సకాలంలో వైద్యసేవలు అందించకపోతే అవి మృత్యువాత పడే అవకాశం ఉంది. నియోజకవర్గంలో గొంతువాపుకు సంబంధించి 39,876 పశువులు, లంపీ స్కిన్ డిసీజ్ 38,567 పశువులకు, అలాగే బ్రూసెల్లోసిస్ వ్యాధి సోకకుండా 3,200 పెయ్యి దూడలకు టీకాలు వేశాం.

– డాక్టర్ ఎం. సాయి బుచ్చారావు, పశువర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్, జీలుగుమిల్లి

శ్రీవారి ఆలయానికి శ్రావణ శోభ

భక్తులతో కళకళలాడుతున్న క్షేత్ర పరిసరాలు



ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంలో భక్తుల తాకిడి

ద్వారకాతిరుమల: శ్రావణమాస పర్వదినాలను పురస్కరించుకుని ద్వారకాతిరుమల క్షేత్రం భక్తులతో కళకళలాడుతోంది. వేలాది మంది భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతున్నాయి. సెలవుదినం కావడంతో ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉంది. ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతంతో పాటు, అనివేటి మండపం, ప్రధాన రాజగోపుర మెట్ల దారి భక్తులతో కళకళలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు నిరంతరాయంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. శాకాంబరి దేవిగా దర్శనమిస్తున్న క్షేత్ర దేవత శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారిని భక్తులు తిరుగు ప్రయాణంలో దర్శించి, తరించారు. భక్తులకు దేవస్థానం అధికారులు ఉచిత అన్న ప్రసాదాన్ని అందిస్తున్నారు.







మెట్ల మార్గం గుండా వస్తున్న భక్తులు, శ్రీవారిని దర్శిస్తున్న భక్తులు, శాకాంబరి అలంకారంలో శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు

పేకాట స్థావరంపై దాడి

పెదవేగి : కొప్పాకలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో అందడంతో ఎస్సై తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఘటనా ప్రదేశంలో రూ.2,100 నగదు, రెండు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ చెప్పారు.